బిజెపికి డిపాజిట్ రాదు

- కిషన్ రెడ్డి, కెటిఆర్ బ్యాడ్ బ్రదర్స్.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- కాంగ్రెస్ ప్రణాళికలతోనే హైదరాబాద్‌కు ఆదాయం
- విద్య వ్యాపారం కాదు... సేవ
- బ్లాక్‌మెయిల్ చేస్తామంటే ప్రభుత్వం ఊరుకోదు : సిఎం రేవంత్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపికి డిపాజిట్టు కూడా రావని,బిఆర్ఎస్ గెలిచే అవకాశమే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాడ్ బ్రదర్స్ అని, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని చెప్పారు. శుక్రవారం సిఎం జూబ్లిహిల్స్‌లో విలేకరులతో మాట్లాడారు. "2004-2014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి అన్నారు. ఒఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. 2014 నుంచి కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని భారత రాష్ట్ర సమితి.. రాష్ట్రానికి చేసింది శూన్యం. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2023లో కెసిఆర్ తెలంగాణను రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు యుపిఎ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది ఎవరు? ఐటిఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేది. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదు. బిఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం,ప్రగతి భవన్ నిర్మించారు. కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరికీ అనుమతి లేని విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారు. రైతు కోసమని కట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లకే కూలింది. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదు. మంజూరైన పాతబస్తీ మెట్రోను కూడా పక్కకు పెట్టారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్‌టి నష్టాలకు కూడా భారత రాష్ట్ర సమితే కారణం. వారిద్దరినీ బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు..2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలో విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5వేల కోట్లతో పనులు ప్రారంభించాం. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి.. వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చాం. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు." కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి ఆరు నెలలు పార్లమెంట్ ఎన్నికలతో గడిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోపనిచేసింది ఏడాదిన్నర మాత్రమే. ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే ఒఆర్ఆర్‌ను కేవలం రూ.7వేల కోట్లకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అమ్ముకుంది. దీపావళి రోజు కూడా ఇళ్లలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని ఏమనాలి? హైదరాబాద్‌లో 44 చెరువులను భారత రాష్ట్ర సమితి నేతలు కబ్జా చేశారు. అంబర్‌పేటలో బతుకమ్మకుంటను ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆక్రమించారు. చెరువుల్లోని కబ్జాలను తొలగించి పునరుద్ధరిస్తే.. దానిపై రాజకీయం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లోసబర్మతిప్రక్షాళన చేసుకున్నారు.. యుపిలో నది ప్రక్షాళన చేశారు. అహ్మదాబాద్‌లో కొత్త నగరం కట్టుకున్నారు.. తెలంగాణలో అడ్డుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్ వల్లే నగరం అభివృద్ధి చెందింది. ఇప్పుడూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివ ద్ధి పనులు జరుగుతాయి. అభివృద్ధి పనుల వల్ల పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రజలను ఓటు అడుగుతున్నా.. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం" అని సీఎం విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. "మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం.విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా? రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతోరాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించక పోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండి" అని సీఎం అన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,అజహరుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సిఎల్‌సి రాష్ట్ర మూడో మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పౌరహక్కుల సంఘం (సిఎల్‌సి) రాష్ట్ర మూడో మహాసభను శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, ఎన్ నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జరగనున్న ప్రారంభ సభలో ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి, ప్రొఫెసర్ జి హరగోపాల్, ప్రారంభ ఉపన్యాసకులుగా ముంబయి హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ కోల్సేపాటిల్, సామాజిక కార్యకర్త బేలా భాటియా పాల్గొంటారని పేర్కొన్నారు. మొదటి రోజు నాలుగు సెషన్లలో పలు అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు.


సెమినార్‌లో మాట్లాడుతున్న సాయిబాబు

నూతన లేబర్ పాలసీ రాజ్యాంగ విరుద్ధం

- కార్మికులను బానిసలుగా మార్చేందుకే

శ్రమశక్తి నీతి : సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 'శ్రమశక్తి నీతి-2025' పేరుతో తెచ్చిన నూతన లేబర్ పాలసీ రాజ్యాంగ విరుద్ధమైనది, ఇది కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర అని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు విమర్శించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవనంలో అక్టోబర్ విప్లవం 108వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన 'నూతన లేబర్ పాలసీ-కార్మిక వర్గంపై ప్రభావం' సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మరిన్ని లాభాలు పెంచేందుకు 'శ్రమ శక్తి నీతి 2025' పేరుతో నూతన కార్మిక విధానాన్ని అక్టోబర్ 8న పబ్లిక్ డొమైన్‌లో పెట్టిందని తెలిపారు. ఈ నూతన కార్మిక విధానం రాజ్యాంగంలోని సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమకు తగిన గౌరవం లాంటి అంశాలకు విరుద్ధంగా ఉందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న కోట్లాదిమంది కార్మికులకు సంబంధించిన అంశాలను కార్మిక సంఘాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా తేవడం అప్రజాస్వామిక చర్య అని తెలిపారు. దేశంలో నిర్మాణరంగ కార్మికులకు చట్టాలు అమలు కావడం లేదని, రవాణా రంగ కార్మికులకు నిర్దిష్ట పని గంటలు లేకుండా పోయాయని, హమాలీ ఇతర అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని, స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు కావడం లేదని విమర్శించారు. నూతన కార్మిక విధానం ప్రకారం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసి కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే కుట్ర దాగి ఉందని తెలిపారు. యూనియన్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, అఖిల భారత స్థాయి వరకు సిఐటియు మహాసభలు 2026 జనవరి లోపు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో లేబర్ కోడ్‌ల రద్దు, కార్మిక హక్కుల పరిరక్షణ, కార్మిక చట్టాలు అమలుకు తగిన కార్యాచరణ రూపొందించనున్నట్టు చెప్పారు. ఈ సెమినార్‌లో సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, జిల్లా నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, దుండి వీరన్న, పోతుగంటి మల్లయ్య, ధార స్వేరోబిందు, వెలిశల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సారంపల్లి

'ఎకరాకు ఏడు క్వింటాళ్ల' నిబంధన ఎత్తివేయాలి

- పత్తి తేమను 18 శాతానికి పెంచాలి
- దిగుమతి సుంకాలను కేంద్రం పెంచాలి : సారంపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి ఎకరానికి ఏడు క్వింటాళ్లు కొనాలనే నిబంధన ఎత్తివేసి ఎంత పంట పండితే అంత కొనుగోలు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భారతదేశానికి పత్తి దిగుమతులపై ఉన్న 11శాతం సుంకాన్ని వచ్చే డిసెంబర్ 31 వరకు రద్దు చేసిందని, ఇది అత్యంత దుర్మార్గమని అన్నారు. మన దేశంలో 365 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అవుతుందని, మన వినియోగం 325 లక్షల బేళ్లుఉంటుందన్నారు. అదనంగా ఉన్న 50 లక్షల బేళ్లను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. కానీ అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రోద్భలంతో అమెరికా నుంచి 50 లక్షల బేళ్ల పత్తిని దిగుమతి చేసుకునేందుకు మోడీ అంగీకరించారని, దీనిపై దిగుమతి సుంకాన్ని సైతం రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వల్లే సిసిఐ కొనుగోళ్లలో ఏడు క్వింటాళ్ల నిబంధన పెట్టారని తెలిపారు. పత్తి ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు ఉత్పత్తి అవుతుందని, సిసిఐ ఏడు క్వింటాళ్లు మాత్రమే కొంటే మిగితాది ఎక్కడ అమ్ముకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిబంధన వల్ల మిగిలిన పత్తిని దళారులకు అమ్మేలా చేస్తూ మోడీ ప్రభుత్వం రైతులను అధ్వాన్న పరిస్థితుల్లోకి నెడుతోందని విమర్శించారు. ఇప్పుడు తక్కువ ధరకు బయటి నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడ ధరలు పడిపోవడంతో బడా పరిశ్రమలకు లాభాలు చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో 3లక్షల 65వేల ఎకరాల్లో పత్తి సాగుచేస్తుండగా, దాదాపు 50 లక్షల బేళ్ల పంట ఉత్పత్తి అవుతుందని అన్నారు. రాష్ట్రంలో 22 లక్షల మంది రైతులు పత్తి సాగుచేస్తుండగా, వీరి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. పత్తి కనీస మద్దతు ధర రూ.8110 ఉండగా అంతకన్నా తక్కువకే సీసీఐ కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే, తేమ 8 నుంచి 12 శాతం మాత్రమే ఉండాలని చెబుతున్నారని, కానీ వర్షాలు, తుఫాన్ వల్ల పత్తి తేమ శాతం 12 కన్నా ఎక్కువగా ఉంటుందని, కాబట్టి పత్తి తేమను 18 శాతం వరకూ అంగీకరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం రైతులను ఆదుకునేందుకు పత్తి దిగుమతులను వెంటనే ఆపాలని, మన దిగుమతి సుంకాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజ్, కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్లకు మద్దతివ్వండి

- సిపిఎంను కోరిన ఒయు బిసిజెఎసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

42 శాతం బిసి రిజర్వేషన్ల సాధనకోసం అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరే కార్యక్రమంలో భాగంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ఒయు బిసి జెఎసి బృందం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. బిసి కులాలకు రిజర్వేషన్లు లేకపోవటంతో చట్ట సభలలోకి వెళ్లే అవకాశం కోల్పోతున్నామని తెలిపారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. వెనుక బడిన కులాల జనాభా ఉండి రాజకీయ ప్రాతినిధ్యం లేక చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్గాల అభ్యున్నతి కోసం జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించే బాధ్యత అధికారంలో ఉన్న పాలకులపై ఉందనీ, 42శాతం బిసి కులాల రిజర్వేషన్ల బిల్లును కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో ఒత్తిడి తేవాలని కోరారు. ఒయులో జరుగుతున్న బిసి ఉద్యమాలకు, భవిష్యత్ కార్యాచరణకు మద్దతుంటుందని జాన్‌వెస్లీ ఈ సందర్భంగా తెలిపారు. వెస్లీని కలిసినవారిలో డాక్టర్ :నిజ్జన రమేష్ ముదిరాజ్, దేశగాని సాంబశివ గౌడ్, అర్ఎల్ మూర్తి, అర్ ఎన్ శంకర్ అల్లుడు జగన్ ముదిరాజ్, మాసం పల్లి అరుణ్ కుమార్, నక్క శ్రీ శైలం యాదవ్, బైరు నాగరాజు, సయ్యద్ సలీం పాషా గౌడ్, కోట రమేష్, అనగంటి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నైపుణ్యమే కొత్త బలం

- నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం
- అత్యున్నత ప్రమాణాల కోసం యూనివర్సిటీ కృషి చేయాలి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'విద్యార్థులు కేవలం అకాడమిక్ విజయాలకే పరిమితం కాకుండా, క్రమశిక్షణను దిక్సూచిగా, జిజ్ఞాసను ఇంధనంగా మలచుకోవాలి. నైపుణ్యం అనే కొత్త బలాన్ని పెంపొందించుకుంటూ విజయానికి ఆత్మలా ఉండే నిరంతర అభ్యాసాన్ని మరవద్దు' అని శాతవాహన యూనివర్సిటీ ఛాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు సూచించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన రెండో స్నాతకోత్సవ వేదికపై ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. యూనివర్సిటీల ఎన్ఎఎసి, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ల ఆవశ్యకత గురించి వివరించారు. యూనివర్సిటీ ఉన్నత ప్రమాణాలు సాధించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. తెలంగాణలోని మధ్య, గ్రామీణ ప్రాంతంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో శాతవాహన యూనివర్సిటీ ఒకటని, సమానత్వ ఆవిష్కరణలను మేళవించి విద్యార్థుల విజయ సోపానాలు సాధించడానికి ఈ వర్సిటీ ఎంతగానో కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అయితే, విద్యార్థులు కనే కలలకు బలం చేకూర్చేందుకు, వాటి సాధనకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడాలని ఉద్ఘాటించారు. ఎన్ఏఏసీ (న్యాక్) గుర్తింపు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం కృషి చేయాలని యూనివర్సిటీని కోరారు. డిజిటల్ అభ్యాసం భౌగోళిక, ఆర్థిక పరమైన అడ్డంకులను తొలగించిందన్నారు. ప్రతి డిగ్రీ ఒక ప్రారంభం మాత్రమేనని, ప్రతి వైఫల్యం వినయం అనే దుస్తులు ధరించిన గురువు లాంటిదని చెప్పారు. విద్యార్థులు ప్రయోగాత్మక విద్య ద్వారా మేధస్సునే కాక, నిజాయితీని కూడా పెంపొందించుకోవాలని గవర్నర్ సూచించారు.

సమాజ పరివర్తనకు విశ్వవిద్యాలయాలు కీలకం హెచ్‌సియు విసి ప్రొఫెసర్ బిజె రావు

ఉన్నత విద్య ద్వారా గ్రామీణ, వెనుకబడిన యువత సాధికారతకు కృషి చేయడంలో శాతవాహన విశ్వవిద్యాలయం ఒక ప్రకాశవంతమైన ఉదాహరణగా నిలుస్తోందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ బిజె.రావు ప్రశంసించారు. గ్రాడ్యుయేట్లు అయిన వారిలో చాలా మంది మొదటి తరం అభ్యాసకులే ఉన్నారు. వీరు అనేక సవాళ్లను అధిగమించి ఈ మైలురాయిని చేరుకున్నారని, వారి విజయానికి యూనివర్సిటీ అందించిన అండదండలు, అధ్యాపకుల మార్గదర్శకత్వం, సమ్మిళిత వాతావరణమే కారణం అని చెప్పారు. ఎంఫార్మసీ, ఎల్ఎల్‌బి, బిటెక్ వంటి కొత్త కోర్సులను ప్రారంభించడం ద్వారా శాతవాహన యూనివర్సిటీ తన విద్యాపరిధులను విస్తరిస్తున్న తీరు, మారుతున్న పారిశ్రామిక, సామాజిక అవసరాలకు అనుగుణంగా ముందు చూపుతో వ్యవహరిస్తోందని అభినందించారు. అనంతరం శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ ప్రసంగించారు. అంతకు ముందు వర్సిటీ పరిధిలో ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 161మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 25మంది పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేశారు. అనంతరం గవర్నర్ సహా ఉన్నతాధికారులు కలెక్టరేట్ చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు.

డిసెంబర్‌లో జాతీయస్థాయి కళాఉత్సవాలు

హైదరాబాద్ బ్యూరో : జాతీయస్థాయి కళా ఉత్సవాలు డిసెంబర్‌లో మహారాష్ట్రలోని పూణేలో జరగనున్నాయి. రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ మేరకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన వారు జాతీయ స్థాయిలో పాల్గొంటారని వివరించారు. వోకల్ మ్యూజిక్ సోలోలో వి శ్రీనిధి, డ్యాన్స్ గ్రూప్‌లో ఆర్ మధులత, ఆర్ మల్లీశ్వరి, సిహెచ్ నందిని, పి సరిత, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలోలో బి వజ్రాంశ్, విజువల్ ఆర్ట్స్ టుడీలో వి అన్విత, విజువల్ ఆర్ట్ త్రీడీ టాయ్ అండ్ గేమ్స్‌లో వి విష్ణువర్ధన్, పి గంగాసాగర్, థియేటర్ గ్రూప్‌లో జి వైష్ణవి, ఎం రమాదేవి, సిహెచ్ ఐశ్వర్య, బి లాస్య, వోకల్ మ్యూజిక్ గ్రూప్‌లో వైష్ణవి, శ్రీసాన్విక, ప్రమీదశ్రీ, శ్రీవికాస్, డ్యాన్స్ సోలోలో కె మైత్రి తేజ, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలోలో బి సుందర్‌రాజు, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్‌లో ఎ రోహిత్, వి ఆశీశ్, ఎ అశ్వంత్, సిహెచ్ రిత్విక్, విజువల్ ఆర్ట్స్ సోలో త్రీడీలో ఎం హర్ష, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్‌లో బాదల్ నాయక్, సోనాలిశ్రీలు జాతీయ స్థాయి కళా ఉత్సవాలకు ఎంపికయ్యారని వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన ఆ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో వందేమాతరం వేడుకలు

న్యూఢిల్లీ : భారత ప్రభుత్వ, ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) నుండి అందిన మార్గదర్శకాల ప్రకారం.. జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్ల వేడుకల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ శుక్రవారం వందే మాతరం పూర్తి నిడివి ని సామూహికంగా ఆలపించే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఛైర్మన్ కె ప్రమోద్ కుమార్ రెడ్డి, ఒఎస్‌డిలు డి. శంకరరావు, ఎం అరుణ్ కుమార్, విజిలెన్స్ అధికారి హరీస్ బేతా, బ్యాంకు జనరల్ మేనేజర్లు, బ్యాంకు సిబ్బంది అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

'ఫీజు' కోసం విద్యార్థుల నిరసన

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీలు


కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలంటూ ఎస్ఎఫ్ఐ రాష్ట్రం కమిటీ పిలుపులో భాగంగా జిల్లాల్లో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నల్లగొండ పట్టణంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పుస్తకాలు చదువుతూ నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్ ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వికారాబాద్ పరిగి పట్టణ కేంద్రంలో పుస్తకాలు చదువుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని సంగారెడ్డి జిల్లాలో అందోల్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్దఎత్తున విద్యార్థుల ర్యాలీ తీశారు. అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. సిద్ధిపేట జిల్లాలో గజ్వేల్ మండలంలో పరిధిలో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

పొంగులేటిపై చర్యలు తీసుకోండి

- సిఇఒకు బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నేతలు ఎన్నికల కమిషన్ (ఇసి)ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఇఒ సుదర్శన్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో బిఆర్ఎస్‌వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల అనంతరం దరఖాస్తు చేసుకున్న వారందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామంటూ ఓటర్లను ప్రలోభపెడుతున్నారని అన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌ను ఆయన ఉల్లంఘించారని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఆయన ప్రచారం చేయకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి పీఆర్వో రమేష్ ఓటర్లకు వ్యక్తిగతంగా వాట్సాప్ మెసేజ్‌లు పంపి ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు. చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్, బిఆర్ఎస్ నాయకులు యూసుఫ్, న్యాయవాదులు సిందం శ్రీకాంత్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్టోబర్ విప్లవంతో వినూత్నమార్పు

- దోపిడీ, పీడన లేని సమాజం సాధ్యమేనని చూపెట్టింది : తమ్మినేని
- సోషలిస్టు వ్యవస్థ వైపు అమెరికా ప్రజల మొగ్గు
- అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో బిజెపి విధానాలపై పోరాటాలు : జాన్‌వెస్లీ



సెమినార్‌లో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాంతి, అందరికీ భూమి, ఆహారం హామీలను నెరవేర్చిన సోవియట్ యూనియన్ అక్టోబర్ విప్లవం సమాజంలో వినూత్న మార్పును తీసుకొచ్చిందనీ, దోపిడీ, పీడన లేని సమాజం సాధ్యమేనని చూపెట్టినదని మహోత్తర పోరాటం అది అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కొనియాడారు. అక్టోబర్ విప్లవ దినోత్సవానికి నవంబర్ ఏడో తేదీన జరుపుకోవడానికి గ్రిగేరియన్ క్యాలెండర్ కారణమన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం(ఎంబి భవన్)లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి అధ్యక్షతన అక్టోబర్ విప్లవం-విశిష్టత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. లెనిన్ నేతృత్వంలోని బోల్షివిక్ పార్టీ, బూర్జువాలు కలిసి రష్యాలో జార్ చక్రవర్తుల పాలనను కూలదోసి ఫిబ్రవరి 17న ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే, ప్రజలు ఆశించిన విధంగా యుద్ధాల నుంచి విముక్తి, రైతులకు భూమి, అందరికీ రేషన్ అందించేందుకు బూర్జువాలు సిద్ధంగా లేకపోవడంతో ప్రజల సహకారంతో అక్టోబర్ విప్లవం ద్వారా లెనిన్ నాయకత్వంలో రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ ప్రభుత్వం యుద్ధాల నుంచి శాంతి కలిగించి పేదలకు భూములను పంచిందనీ, అందరికీ రేషన్, సంక్షేమం అందించిందని వివరించారు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలివ్వటం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడంతో లెనిన్ ప్రభుత్వం పట్ల విశ్వసనీయత పెరిగిందన్నారు. ఓవైపు రష్యాలో జాతుల మధ్య ఐక్యత కోసం సిద్ధాంతాన్ని రూపొందించడంతోనే ఆ తర్వాత కాలంలో సోవియట్ రష్యా ఏర్పడిందన్నారు. అదే సమయంలో జర్మనీతో వ్యూహాత్మక సంధి చేసుకుందని తెలిపారు. 70 ఏండ్లపాటు రష్యా సోషలిస్టు ప్రభుత్వం ప్రపంచానికి ప్రత్యామ్నాయ పాలన అందించిందన్నారు. ఆ 70 ఏండ్లలో అనేక దేశాల నేతలు సోషలిస్టు భావజాలం వైపు మొగ్గు చూపారని తెలిపారు. ఆ తర్వాత కాలంలో వచ్చిన పాలకులు తీసుకున్న విధానాలతో 1989-90 సోషలిస్టు వ్యవస్థ కూలిపోయిందన్నారు. దీంతో కమ్యూనిస్టుల పని అయిపోయిందనీ, పెట్టుబడి దారీ వ్యవస్థలోనూ ప్రజల సంక్షేమం ఉందని ప్రచారాన్ని కొన్ని శక్తులు చేపట్టాయన్నారు. సిద్ధాంతాన్ని అమలు చేయడంలో నాయకుల నిర్ణయాలు సరిగా లేకపోవచ్చుగానీ, ఎప్పటికీ కమ్యూనిస్టు సిద్ధాంతం అత్యున్నతమైనదని ఆనాడే సిపిఎం సగర్వంగా చెప్పిందన్నారు. ఒక దేశంలో కమ్యూనిస్టు ప్రభుత్వం రావడం, సోషలిస్టు వ్యవస్థ నిర్మించడం వేరు వేరు అంశాలన్నారు. ఉత్పత్తి విధానంలో మార్పు, ఆర్థిక విధానాలు, ఉద్యోగాల కల్పన, మహిళలకు సమాన అవకాశాలు వంటి అంశాల్లో మార్పులు రాకుండా కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చినంత మాత్రాన సోషలిస్టు వ్యవస్థగా మారిందని చెప్పలేమన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలనీ, సంపద సష్టించాలనీ, పోగైన సంపదను పంచాలని చెప్పారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... ప్రపంచంలో సోషలిస్టు వ్యవస్థ పని అయిపోయిందన్న పెట్టుబడిదారీ దేశాలు సంతోషపడుతున్న సమయంలోనే చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోషలిస్టు వ్యవస్థ నేడు ప్రపంచం ముందుకు బలంగా వచ్చిందన్నారు. పేదరిక నిర్మూలన, అభివద్ధి, ఉద్యోగాల కల్పనలో చైనా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పెట్టుబడి దారీ దేశమైన అమెరికాకు గుండెకాయ లాంటి ఆర్థిక రాజధాని న్యూయార్కులో సోషలిస్టు భావజాలం ఉన్న మమ్దాని అధికారంలోకి వచ్చారనీ, అమెరికా ప్రజలు కూడా సోషలిస్టు వ్యవస్థ వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మార్క్సిజం ప్రభావం పెరుగుతున్న తీరును వివరించారు. కడు పేదరికాన్ని నిర్మూలించడంలో కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం వచ్చాక మహిళలకు, పురుషులకు సమాన హక్కులు కల్పించబడ్డాయని, పేదరిక నిర్మూలన జరిగిందనీ, ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించిందనీ, రాజ్యపాలన నుంచి మతాన్ని వేరు చేసిందని, చర్చి నుంచి పాఠశాలలను దూరం చేసిందని వివరించారు. మన దేశంలో మాత్రం నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలనలో మతాన్ని జొప్పిస్తున్నదనీ, విద్యలోకి ఆర్ ఎస్ ఎస్ జొరబడిందని విమర్శించారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో మోడీ సర్కారు విధానాలను ఎండగడుతూ పోరాటాలు చేయాలనీ, ప్రజలను చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌లో వేదికపైకి వక్తలను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జె బాబూరావు ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


వందేమాతరం గీతాలాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతర గీతం

- గుణాత్మకమైన విద్యతోనే మంచి భవిష్యత్
- మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వందేమాతర గీతం ఆనాడు యావత్ భారతదేశాన్ని ఉద్యమస్ఫూర్తితో నడిపించిందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని మహబూబియా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సామూహిక ఆలాపన ద్వారా మన జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, లక్ష్య సాధనలో ఈ గీతం ఉపయోగపడుతుందని అన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాల్లో పాలుపంచుకునే అవకాశం తమకు దక్కిందని చెప్పారు. విద్యతోనే మంచి ఉజ్వల భవిషత్ అని, విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని సూచించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ వందేమాతరం గీతం సమర నినాదంలా నిలిచిందని గుర్తు చేశారు. స్వతంత్ర సమరయోధులకు మనోబలాన్నిచ్చిందని, "సుజలాం సుఫలాం మలయజ శీతలాం" ఈ పదాలు వినగానే ప్రతి భారతీయుడి హృదయం దేశభక్తితో ఉప్పొంగుతుందని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సమరయోధులకు ఊపిరిగా, స్వతంత్ర భారతంలో జాతీయ గేయంగా అజరామర కీర్తిని పొందిన 'వందేమాతరం'.. ఓ అక్షర జ్వాల అని అన్నారు. పోరాట స్ఫూర్తిని నింపిన వందేమాతరం గురించి భావితరాలకు ఘనంగా తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని చెప్పారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు కూడా జీవితంలో సవాళ్లను ఎదుర్కొని నిలబడాలని, ఉన్నత శిఖరాలకు చేరితే దేశం గర్వపడుతుందని అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి మీకు విద్యను అందిస్తున్నారని, వారి ఆశలు, కలలు నెరవేర్చాలని కోరారు. విద్యార్థినులతో కలిసి మంత్రులు వందేమాతర గీతాలాపన చేశారు.

గోపినాథ్ ఆస్తులు, మృతిపై విచారణ జరిపించాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణం, ఆయన ఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఆస్పత్రికి రాకుండా బిఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు. మాగంటి ఆస్తులపై సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ మధ్య గొడవలు జరిగాయని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, బిజెఎల్‌పి ఉప నేత పాయల్ శంకర్, గంగిడి మనోహర్ రెడ్డి, బిజెపి ఎస్సి మోర్చా కార్యదర్శి ఎస్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు వేముల అశోక్, అధికార ప్రతినిధులు జె సంగప్ప, సోలంకి శ్రీనివాస్, రితేష్ రాథోడ్‌లతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'నా కొడుకు మరణం ఒక మిస్టరీ అని స్వయంగా గోపినాథ్ తల్లే చెబుతున్నది. అసలు గోపీనాథ్ చనిపోయింది ఎప్పుడు? డెడ్‌బాడీ ఇవ్వకుండా ఎవరి కోసం ఆపారు. గోపీనాథ్ కుటుంబ సభ్యులు, ఆస్పత్రి యాజమాన్యం స్టేట్‌మెంట్లను రికార్డు చేయాలి' అని కోరారు. తండ్రిని చూడడానికి రావొద్దంటూ బిఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ తనను బెదిరించారని గోపీనాథ్ కొడుకు చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గోపీనాథ్ ఆస్తులపై సిఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కెటిఆర్ మధ్య పంపకాల యవ్వారం ఉందన్నారు. అందుకే కెసిఆర్ కుటుంబంపై ఉన్న కేసులపై విచారణ జరగడం లేదని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గోపీనాథ్ అనుచరులెవరూ ప్రచారం కూడా చేయడం లేదన్నారు. సర్వే నివేదికల పేరుతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బిజెపిపై కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ గెలిస్తే...చైన్ స్నాచర్లకు, గంజాయి విక్రేతలకు, సంఘవిద్రోహ శక్తులకు అడ్డాగా మారబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ చేస్తారా? అని సిఎంను ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేదాకా విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ యాజమాన్యాలు చేసే ఆందోళన కార్యక్రమాలకు బిజెపి మద్దతు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.

ఎకరాకు ఏడు క్వింటాళ్ల నిబంధన ఎత్తేయాలి

- యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలి
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిసిఐ ద్వారా ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనను వెంటనే ఎత్తేయాలని తెలంగాణ రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి డిమాండ్ చేశారు. రైతులు పంట అమ్ముకోవడానికి ముందుగానే యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలనే నిర్ణయాన్ని కూడా వెనక్కి తీసుకోవాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొన్ని దశాబ్దాలుగా తెలంగాణలో ఆముదం పంటకు ప్రత్యామ్నాయంగా పత్తి సాగుచేస్తున్నారని తెలిపారు. ఆ పంటను కేంద్ర ప్రభుత్వ ఆదీనంలో ఉన్న సిసిఐ కొనుగోలు చేస్తోందని, పత్తి పంటకు ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధర నిర్ణయిస్తుందని తెలిపారు. పత్తి పంట రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో లేనిదని చెప్పారు. ఈ మధ్యకాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పత్తి కొనుగోలు నుంచి తప్పుకోవాలని ఒక సీక్రెట్ ఎజెండా పెట్టుకొని ముందుకెళ్తున్నదనీ, మోడీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. కరోనా టైంలో చల్లటి చలిలో ఢిల్లీలో వేలాదిమంది రైతులు ఉద్యమం చేసినా మోడీ సర్కారు పట్టించుకోలేదన్నారు. పైగా, అన్నదాతలపైనే తిరిగి కేసులు పెట్టించిందని విమర్శించారు. కనీస మద్దతు ధరల చట్టం చేయాలని నాలుగేండ్లుగా కోరుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.

ఢిల్లీకి చేరుకున్న మయన్మార్ సైబర్ ఫ్రాడ్ బాధిత తెలంగాణ వాసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మయన్మార్ మయవాడీలోని సైబర్ నేరాల శిబిరాల్లో చిక్కుకుని శుక్రవారం స్వదేశానికి తిరిగి వచ్చిన తెలంగాణ పౌరులకు.. ప్రభుత్వం అండగా నిలిచింది. గురువారం రాత్రి ప్రత్యేక భారత వైమానిక దళం (ఐఎఎఫ్) విమానంలో భారతీయ పౌరులను మయన్మార్ నుంచి తీసుకొచ్చారు. వీరిని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు..శుక్రవారం గ్రేటర్ నోయిడాలో సంబంధిత రాష్ట్ర అధికారులకు అధికారికంగా అప్పగించారు. వారిలో 11 మంది వ్యక్తులు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారున్నారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి పలు జిల్లాల వారు ఈ బృందంలో ఉన్నారు. స్వదేశానికి తిరిగి వచ్చిన వీరిని సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు తగిన విచారణ ధృవీకరణ అనంతరం తెలంగాణకు చెందిన వారిని న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులకు అప్పగించారు.

జాతీయ రహదారిపై పత్తి రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిసిఐ కేంద్రంలో పత్తి కొనుగోలు చేయడం లేదని శుక్రవారం జాతీయ రహదారి 44పై జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉండవెల్లి స్టేజి సమీపంలో రైతులు ధర్నా చేపట్టారు. గద్వాల జిల్లాలో ప్రభుత్వ ఏర్పాటు చేసిన సిసిఐ కొనుగోలు కేంద్రంలో పత్తి నల్లగా ఉందని పంటను కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, విషయం తెలిసి అక్కడికి వచ్చిన సిఐ రవిబాబు.. రైతులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న చిన్న సమస్యలకు జాతీయ రహదారిపై ధర్నా చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అంబులెన్స్‌లో వచ్చే వారికి ట్రాఫిక్ సమస్యతో సకాలంలో వైద్యం అందక ఎవరైనా చనిపోతే.. 10 ఏండ్లు జైల్లో వేస్తామని రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. ఏదైనా సమస్య ఉంటే కలెక్టర్ దగ్గర ధర్నా చేసుకోండని చెప్పారు.



స్క్రాబ్ దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత ఇనుప సామాను దుకాణం (స్క్రాప్)లో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంగడి బజార్‌లో వ్యాపారి పర్వతం పూర్ణచందర్ స్క్రాబ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. కాగా స్క్రాబ్ దుకాణంలో వెనకవైపు శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో అక్కడ ఉన్న పాత సామగ్రి, ప్లాస్టిక్ పైపులు, రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు అంటుకొని ఆ ప్రాంతమంతా పొగతో నిండుకుంది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. కాగా, రూ.15 వేల ఆస్తి నష్టం జరిగినట్టు తెలుస్తోంది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కాలేజీలు మూసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు

- విద్యార్థుల ఉద్యమంపై నిర్లక్ష్యం తగదు
- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజు బకాయిల కోసం కాలేజీలు మూతపడినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని, విద్యార్థుల ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేయొద్దని రాజ్యసభ సభ్యులు, బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఐదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కాలేజీలు మూసేస్తే ప్రభుత్వంలో స్పందన లేదని విమర్శించారు. ఫీజుబకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో ఎంతో ముఖ్యమైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ స్కీంలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉచితాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించి డబ్బులు లేవనడం విచారకరమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఒక్కొక్క కాంట్రాక్టర్‌కు వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. విద్యార్థుల ఫీజు బకాయిలకు మాత్రం రెండేండ్లుగా రూపాయి చెల్లించలేదని విమర్శించారు. ఫీజు బకాయిలకు రూ.6000 కోట్లు ఖర్చు చేయడానికి ఈ ప్రభుత్వానికి మనసు రావడం లేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు, అందులో పని చేసే ఉపాధ్యాయులు మరోవైపు విద్యార్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.


విద్యార్థులతో పాటు నిరసన తెలుపుతున్న ఆర్ కృష్ణయ్య

ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేకపోతే విద్యార్థుల ఉద్యమం చిలికి చిలికి గాలి వానగా మారి ప్రభుత్వమే కూలిపోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలా వెంకటేష్, రాందేవ్, భరత్, అనంతయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీ కొట్టిన డిసిఎం

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగి ఉన్న ఆర్‌టిసి బస్సును వెనుక నుంచి డిసిఎం ఢీ కొట్టిన ఘటనలో బస్సులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం షాద్‌నగర్ నుంచి ప్రయాణికులతో హైదరాబాద్ వస్తోంది. ఆరాంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ పడటంతో డ్రైవర్ బస్సును ఆపాడు. అదే సమయంలో కర్నాటకకు చెందిన డిసిఎం వేగంగా వచ్చి వెనకనుంచి ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దాంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికులను కిందికి దించారు. ఈ ఘటనలో పలువురికి గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డిసిఎం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డిసిఎం డ్రైవర్ అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు స్పష్టం చేశారు. చేవెళ్ల ఘటన మరువక ముందే మరో ఘటన జరగడంతో స్థానికంగా తీవ్ర భయాందోళన వాతావరణం నెలకొంది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే

కెసిఆర్‌కు గురు దక్షిణ కింద బిజెపి అభ్యర్థి బలి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డికి చాలెంజ్ చేస్తున్నా. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలువబోతుంది' అని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అని నొక్కి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మరోమంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కెసిఆర్ చేసిన సహాయానికి గురుదక్షిణగా బిజెపి అభ్యర్థిని కిషన్‌రెడ్డి బలిస్తున్నారని ఆరోపించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 80,549, కాంగ్రెస్ అభ్యర్థికి 64,212, బిజెపికి 25,866 ఓట్లు పడ్డాయనీ, అదే పార్లమెంట్ ఎన్నికలకు వచ్చే సరికి ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 89,705 ఓట్లు, బిజెపికి 64,673 ఓట్లు, బీఆర్ఎస్‌కు 18,405 ఓట్లు వచ్చాయని గణాంకాలతో వివరించారు. శాసన సభ ఎన్నికల్లో బిజెపి 25 వేల ఓట్లు సాధిస్తే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అదే శాసభ సభ నియోజకవర్గం నుండి 64 వేల ఓట్లు ఎలా వచ్చాయి? ఇది పరస్పర సహకారం కాదా? అని నిలదీశారు. ఎన్నికల ఫలితాల వెబ్‌సైట్‌ను చూస్తే బిజెపి-బిఆర్ఎస్ పార్టీలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పరస్పరం సహకరించుకుంటున్నాయనే విషయం స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. కెటిఆర్ తానా అంటే కిషన్‌రెడ్డి తందానా అంటారని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 25 వేల ఓట్లు వచ్చాయికదా..ఇప్పుడు అన్ని ఓట్లు తెచ్చుకోగలరా? ఇప్పుడు డిపాజిట్ అయినా వస్తుందా? అని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపికి పది వేల ఓట్ల కంటే ఎక్కువ రావు అని చెప్పారు. బిజెపిని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న నాయకులను రాజకీయ సమాధి చేస్తున్నారనీ, ముఖ్యనాయకులు బిఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకుని పనిచేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని కవిత చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. బిఆర్ఎస్ నేతల మాదిరిగా తమకు కక్ష సాధింపు ధోరణి లేదని చెప్పారు.

బాలోత్సవాలు జ్ఞాన వికాస దీపాలు

- పిల్లల్లో సృజన పాటవాలకు తోడ్పాటునందించాలి
- మార్కులతో కొలువలేం.. మూస వార్షిక పరీక్షలతో జతకట్టలేం : సుధీర్ సంద్ర
- ముగిసిన తెలంగాణ బాలోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలోత్సవాలు జ్ఞాన వికాస దీపాలుగా ఐదు సంవత్సరాలుగా వెలుగునొందుతున్నాయని పిల్లల మానసిక నిపుణులు, కౌన్సిలర్ సుధీర్ సంద్ర అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లల జాతర కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎన్ని కోట్లు కుమ్మరించినా తిరిగి పొందలేనిది బాల్యమని, అటువంటి పసితనాన్ని పసిడి జ్ఞాపకాలతో ఆటపాటల సృజనకు ఒక సంక్షిప్త నామం తెలంగాణ బాలోత్సవమని చెప్పారు. బాలోత్సవం వేలాది చిన్నారుల స్నేహ సంఘమని, భవిష్యత్‌పై కొత్త ఆశలు మోసుకెళ్తుందని అన్నారు. జాతి భవితకైనా భాష మనుగడకైనా పిల్లలే ఆశా దీపాలు అని తెలిపారు. పిల్లలను మార్కులతో కొలువలేమని, మూస వార్షిక పరీక్షలతో జత కట్టలేమని అన్నారు. కుంచతో అద్భుత విన్యాసాలు చేశారు.. పద్యాలు వల్లె వేశారు.. మట్టితో బొమ్మలు చేశారు.. చిత్తు పేపర్లతో అద్భుతమైన క్రాఫ్ట్ బొమ్మలేశారు.. జానపదం మా ప్రాణపదమంటూ ఎగిరి గంతులేశారు.. శాస్త్రీయ నృత్యాలతో పిల్లలు నాట్యమయూరాలుగా మారిపోయారు.. మొత్తంగా పిల్లలను పెద్దలు చూసినప్పుడు మంత్రముగ్ధులయ్యేలా ప్రదర్శనలన్నీ ఆకట్టుకున్నాయని కొనియాడారు. బాలోత్సవ తరహా వేదికలు మరిన్ని ఆవిర్భవిస్తే ఈ పురిటిగడ్డపై శాస్త్ర విజ్ఞానం వెల్లివిరుస్తుందని విశ్వసిస్తున్నానన్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడొద్దు, ఎవరికి వారే పిల్లల సృజన పాటవాలకు చేతనైన తోడ్పాటు అందించాలని అన్నారు. అందుకోసం వీధి వీధినా బాలోత్సవాల అవసరం పెరుగుతుందన్నారు. కథలు చెప్పడం వల్ల పిల్లల ఊహాశక్తికి రెక్కలు తొడిగాయన్నారు. బాలోత్సవం దేశ పునాదుల్ని గట్టిపరుస్తుందని చెప్పారు.


బాలోత్సవంలో విద్యార్థులతో సుధీర్ సంద్ర

బాలోత్సవం భారతీయ కళలను, తెలంగాణ కళల సంస్కృతిని అద్భుతంగా తెలియజేసే ఒక గొప్ప ప్రయత్నమని, మనం ఎట్టా ముందుకు దూసుకెళ్లాలని పిల్లలకు, ఉపాధ్యాయులకు చక్కటి హిత బోధ చేసిందని తెలిపారు. విలువలు లేని విద్య అవసరం లేదని, ప్రయివేటు విద్యాసంస్థలు సైతం నాణ్యమైన విద్యని అందించలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్లో నిరాశ, నిస్పృహలు పెరుగుతున్నాయని, తద్వారా ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విలువలు కలిగిన విద్యను అందించినప్పుడే అవి దేశ ప్రగతికి ఆధారమవుతాయని అన్నారు. ఓడిపోతేనేం అది రేపు గెలుపు కోసమని ఒక భరోసా అని వివరించారు. నేడు 67 శాతం మంది విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడటంతో కుటుంబాలు విచ్ఛిన్నం అయిపోతున్నాయన్నారు. మార్పు రావాలంటే రేపటి తరంలో మార్పు రావాలన్నారు. ఆ మార్పునకు పునాదియే బాలోత్సవం అన్నారు.

తెలంగాణ బాలోత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్.సోమయ్య మాట్లాడుతూ.. పసిపిల్లల్లో నిగూఢంగా దాగిన సృజనను వెలికి తీసే ఒక ప్రయత్నం 5 ఏళ్లుగా జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా కల్చరల్ అండ్ అకాడమిక్‌గా 18 ఈవెంట్లతో అలరించారన్నారు. కథ, కవిత్వం, ఏకపాత్రాభినయం, దాండియా, జానపద గేయాలపన, జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, మట్టి బొమ్మలు, వివిధ రకాల శాస్త్రీయ ప్రయోగాలు.. వంటివి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి బాగా ఉపయోగపడ్డాయన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి భాషా సాంస్కృతిక శాఖ, ఎల్ఐసి, భారత్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్, ఎస్‌సిసిఎల్, సంస్థల సహకారం అందించాయని తెలిపారు. ప్రారంభోత్సవానికి వచ్చిన కెవి రమణచారి, సుద్దాల అశోక్ తేజ, ఎవరెస్టు శిఖరం అధిరోహించిన మాలావత్ పూర్ణిమ, కుట్టి ఓ కుట్టి గ్రంథాలయాలు ఏర్పాటు చేసిన ఆకర్షణ సతీష్‌కు, రెండ్రోజుల కార్యక్రమాలకు జడ్జిలుగా వ్యవహరించి విద్యార్థులకు బహుమతులిచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి వాలంటీర్స్‌గా సహకరించిన భారత్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ ఎన్‌సిసి క్యాడర్ ఉపాధ్యాయులు, ఆ రంగాలలో పనిచేస్తున్న పిల్లల సైకాలజిస్టులు, కళాకారులకు, మీడియా మిత్రులకు, పర్మిషన్ ఇచ్చి ప్రోత్సహించిన పోలీస్, మున్సిపాలిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు.